క్లుప్తంగా

జెడ్పీ చైర్మన్‌కు సన్మానం



జెడ్పీ చైర్మన్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన ముత్యాల రామగోవిందరెడ్డిని గురువారం బద్వేలులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. దాదాపు 20 ఏళ్లుగా రాజకీయాల్లో కొనసాగుతున్న రామగోవిందరెడ్డి ఎంపీటీసీ సభ్యుడి నుంచి జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఎన్నికవడంలో ఎంతో కృషి దాగి ఉందని రాజగోపాల్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో బి.మఠం ఎంపీపీ వీరనారాయణరెడ్డి, మున్సిపాలిటీ నాయకులు శ్యాం సుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బంగారు చెవి కమ్మ అందజేత



చెవి కమ్మను అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

మైదుకూరు : బస్సులో ప్రయాణిస్తూ ఓ ప్రయాణికురాలు పోగొట్టుకున్న చెవి కమ్మను మైదుకూరు ఆర్టీసీ డిపో అధికారులు తిరిగి అందజేసిన సంఘటన గురువారం జరిగింది. కలసపాడు మండలం సింగరాయపల్లెకు చెందిన పెద్దేటి మరియమ్మ బుధవారం పోరుమామిళ్ల నుంచి మైదుకూరు డిపోకు చెందిన బెంగళూరు సర్వీస్ బస్సులో ప్రయాణించింది. బెంగళూరులో బస్సు దిగిన అనంతరం ఆమె తన చెవి కమ్మ కనిపించకపోవడాన్ని గమనించింది. సమాచారాన్ని మైదుకూరు ఆర్టీసీ డిపో ఏడీసీ ఎం.లక్ష్మయ్యకు తెలియజేసింది. ఆయన బస్సుడ్రైవర్ కేవీ నాయుడుకు సమాచారం అందించగా.. మరియమ్మ కూర్చున్న సీటు కింద పడి ఉన్న కమ్మను సేకరించిన డ్రైవర్ డిపో అధికారులకు అందజేశాడు. గురువారం డిపో సెక్యూరిటీ అధికారులు పుల్లయ్య, వెంకటేశ్వర్లు, ఏడీసీ లక్ష్మయ్య సమక్షంలో మరియమ్మ భర్త పీటర్‌కు చెవి కమ్మను అందజేశారు.

రాయితీపై వ్యవసాయ సామగ్రి పంపిణీ



రాయితీపై విత్తన గొర్రు అందజేస్తున్న వీఏఏ మనోహర్

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని 35 మంది రైతులకు రాయితీపై వ్యవసాయ సామగ్రిని మండల వ్యవసాయాధికారి శివశంకర్‌రెడ్డి గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 35 మంది రైతులకు రూ.8 లక్షల రాయితీ మొత్తం మంజూరైందన్నారు. విత్తన గొర్రు, ఈనాడు గొర్రు, 9 చెక్కల గొర్రు, డ్రైవాన్ స్ప్రేయర్లు, బ్యాటరీ స్ప్రేయర్లు తదితర పరికరాలను విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ల ద్వారా రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇంకా కావాల్సిన రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో డాక్యుమెంట్లను అందజేసి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఐదు ఎకరాలలోపు పొలం, ట్రాక్టర్ ఆర్‌సీతోపాటు ఈ క్రాప్‌లో పంట నమోదు చేసుకున్న రైతులు అర్హులన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

మైదుకూరు : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మైదుకూరు ఆర్టీసీ డిపోలో ఉద్యోగులు రెండో రోజు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఉదయం విధులకు హాజరైన ఉద్యోగులు డిపో గేటు వద్ద ఎర్ర బ్యాడ్జీలను ధరించి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై నిరసన తెలిపారు. చాలా కాలంగా పలు డిమాండ్లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతున్నా వాటిని పరిష్కరించడంలో నిర్లక్ష్యం చూపుతున్నారని ఈ సందర్భంగా ఉద్యోగులు ఆరోపించారు.

చేతి పంపులను మరమ్మతు చేయించండి

పోరుమామిళ్ల : మండలంలో చెడిపోయిన బోరింగులు (చేతిపంపులు) మరమ్మతుకు నోచుకోక చాలా కాలమైందని సీపీఐ ఏరియా కార్యదర్శి మస్తాన్, మండల కార్యదర్శి రవికుమార్ పేర్కొన్నారు. మండలంలో చేతిపంపులు మరమ్మతు చేయించాలని, కొత్త బోర్లు వేయాలని గురువారం సీపీఐ నాయకులు ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ప్రతి పంచాయతీలో చేతిపంపులు మరమ్మతుకు నోచుకోక ప్రజలకు ఉపయోగపడటం లేదన్నారు. రామేశ్వరం నుంచి గానుగపెంట వరకు అన్ని గ్రామాల్లో బోరింగులు బాగు చేయాలని, అదే సమయంలో ప్రతి పంచాయతీలో కనీసం 3 చేతిపంపులు కొత్తవి వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కేశవ, చెన్నయ్య, ఫిరోజ్, వీరయ్య, నరసింహులు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఉపాధికి మరింత భరోసా

- కూలీ రూ.307కు పెంపు
- గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న కూలీలు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కలసపాడు : ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు కేంద్ర ప్రభుత్వం మరింత ప్రయోజనం కల్పించింది. కూలీల వేతనాలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా గతంలో కూలీ రూ.300లు చెల్లించగా ఏప్రిల్ 1 నుంచి అదనంగా రూ.7లు చెల్లించనుంది. కూలీల వలసలను తగ్గించి ఉన్న ఊరిలోనే కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా కూలీలకు అందించే వేతనాన్ని ఏటా పెంచుతూ మరింత భరోసాను కల్పిస్తోంది. తాజాగా రూ.7లు పెంచుతూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు రోజువారీగా రూ.300లు కూలీ చెల్లిస్తుండగా ఏప్రిల్ 1 నుంచి రూ.307లు ఇవ్వనుంది. దీంతో కూలీల కుటుంబాలకు ఆర్థిక లబ్ధి చేకూరనుంది.

రూ.87.50 నుంచి రూ.307కు

2005లో ఉపాధి హామీ పథకం ప్రారంభమైంది. మొదట్లో కూలీలకు రూ.87.50లు చెల్లించేవారు. 2002లో రూ.12లు పెంచగా 2023లో గరిష్టంగా కూలీని రూ.272లు, 2024లో రూ.300లు, 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ.307లుగా కేంద్రం నిర్ణయించింది. ఏటా ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుండి కొత్త వేతనాలు అమలు చేస్తోంది.

5700 జాబ్‌కార్డులు

కలసపాడు మండలంలో 13 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 5700 జాబ్‌కార్డులు ఉన్నాయి. 8400 మంది కూలీలు ఉన్నారు. అన్ని పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి. ఈ పథకం కింద గ్రామాల్లో కాలువల పూడికతీత, కాలువల మరమ్మతు, అమృత్ సరోవర్ కింద చెట్లు నాటడం, భూ అభివృద్ధి పనులు, ఫారం పాండ్స్ పనులు జరుగుతున్నాయి. పనుల కొలతల ప్రకారమే ప్రభుత్వం కూలీలకు వేతనం చెల్లిస్తుంది.

ఇతర పనులపై మొగ్గు

కూలీ రేట్లు ఏటా పెంచుతున్నా కూలీలు మాత్రం ఉపాధి హామీ పనులపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. గతంలో వేసవిలో వ్యవసాయ పనులు లేకపోవడంతో ఉపాధి పనులపై ఆసక్తి చూపేవారు. ప్రస్తుతం రూ.307లు కూలీ చెల్లిస్తున్నా పనుల కొలత ప్రకారమే కూలీ ఇస్తుండటంతో కూలీలకు పెద్దగా గిట్టుబాటు కావడం లేదు. మండలంలో పొగాకు పంట ఎక్కువగా సాగు చేయడంతో కూలీ రూ.500 నుంచి రూ.600లు చెల్లిస్తుండటంతో కూలీలు అటువైపు మొగ్గు చూపుతున్నారు. ఇక వ్యవసాయ పనుల సమయంలో కూలీలకు డిమాండ్ ఉండటంతో పాటు డబ్బులు ఎక్కువగా ఇవ్వడమే కాకుండా రైతులు కూలీలకు రవాణా సౌకర్యం కల్పిస్తున్నారు. దీంతో కూలీలు అటువైపు వెళుతున్నారు.

కూలీల సంఖ్య పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు

ఉపాధి హామీ పథకంలో కూలీలను పెంచేందుకు సంబంధిత అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు మండల పరిధిలోని గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. గ్రామసభలు ఏర్పాటు చేసి ప్రభుత్వం అందించే కూలీ, ఇతర అలవెన్స్‌ల గురించి వివరిస్తున్నారు.

హర్షణీయం



ఉపాధి హామీ పథకంలో తక్కువ కూలీ నుంచి పనిచేస్తున్నాను. ఇటీవల కేంద్ర ప్రభుత్వం కూలీని రూ.300 నుంచి రూ.307లకు పెంచడం హర్షణీయం. పెంచిన కూలీతో కూలీలకు కొంత మేర మేలు జరగనుంది. కూలీ డబ్బులను త్వరగా చెల్లించేలా కృషి చేస్తే మరింత మేలు చేకూరనుంది.

– పి.తిరుమలమ్మ, ఉపాధి కూలీ, కలసపాడు మండలం

శుభపరిణామం



కూలీ పెంచడం శుభపరిణామం. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద కాలువల్లో పూడికతీత, అమృత్ సరోవర్ కింద చెట్లు నాటడం తదితర పనులు చేపట్టాం. ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు పని చేస్తాం. కూలీ పనులను సద్వినియోగం చేసుకుంటున్నాను.

– బి.భాస్కర్‌రెడ్డి, ఉపాధి కూలీ, కలసపాడు మండలం

సద్వినియోగం చేసుకోండి



గ్రామాల్లో వలసలను నియంత్రించేందుకు ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చారు. ఉపాధి హామీ జాబ్‌కార్డు కలిగిన వారందరూ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఆర్థికంగా ఎదగడానికి ఇది ఎంతగానో తోడ్పడుతుంది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల కూలీ రేట్లు పెంచింది. దీంతో కూలీలకు మరింత ప్రయోజనం చేకూరనుంది.

– శివశంకర్‌రెడ్డి, ఉపాధి ఏపీఓ, కలసపాడు మండలం

రేపు మృత్యుంజయ హోమం

ప్రొద్దుటూరు కల్చరల్ : ఆరుద్ర నక్షత్రం సందర్భంగా స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ రామచంద్రాచార్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం ఆరు గంటలకు గణపతి, నవగ్రహ, మృత్యుంజయ హోమాలను నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఆసక్తిగల భక్తులు ఆలయ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకుని హోమ కార్యక్రమాల్లో పాల్గొని స్వామి, అమ్మవార్ల అనుగ్రహం పొందాలని కోరారు.

5న సివిల్ సర్వీసెస్‌పై అవగాహన సదస్సు

ప్రొద్దుటూరు కల్చరల్ : ఈ నెల 5న సీబీఐటీ కళాశాలలో సివిల్ సర్వీసెస్‌పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు రిఫ్లెక్షన్ ఐఏఎస్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి, వివేకానందరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5న చాపాడు మండలం పల్లవోలు సమీపంలోని సీబీఐటీ కళాశాలలో సదస్సు ఉంటుందని, విద్యార్థులు, యువత పాల్గొని సందేహాలను నివృతి చేసుకోవాలని సూచించారు.

7న మండల సమావేశం

మైదుకూరు : మైదుకూరు మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 7న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కె.శ్రీధర్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించే ఈ సమావేశంలో మండల అభివృద్ధిపై సమీక్ష చేస్తారని పేర్కొన్నారు. సమావేశానికి సభ్యులతోపాటు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

పేదలకు పట్టాలు మంజూరు చేయాలి



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

బద్వేలు అర్బన్ : పట్టణ పరిధిలో స్లమ్ ఏరియాల్లో ఉన్న నిరుపేదలకు కనీస మౌలిక సౌకర్యాలు కల్పించడంతో పాటు వారి నివాస గృహాలకు క్రమబద్ధీకరణ స్కీంలో పట్టాలు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. పేదల కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని సుందరయ్యకాలనీ, ఐలమ్మకాలనీ, జ్యోతిబసుకాలనీ, మార్తోమానగర్ వంటి పలు స్లమ్ ఏరియాలలో దాదాపు పది వేల మంది పైచిలుకు నిరుపేదలు కనీస మౌలిక వసతులు లేక జీవనం సాగిస్తున్నారని అన్నారు. అలాగే ఆయా కాలనీల్లో ప్రభుత్వ స్థలాల్లో గత 20 సంవత్సరాలుగా పేదలు స్థిరనివాసం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తుంటే ఇప్పటి వరకు ఇంటి పట్టాలు ఇవ్వకపోవడంతో వివిధ రకాల పథకాలకు వారు దూరమవుతున్నారని అన్నారు. పేదలు నివసించే ప్రతి ఇంటికి క్రమబద్ధీకరణ స్కీంలో భాగంగా ఎటువంటి షరతులు లేకుండా పట్టా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతి ఇంటికి రూ.200లకే కుళాయి కనెక్షన్ మంజూరు చేయాలని కోరారు. తొలుత పాత మున్సిపల్ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా అనంతరం ఆర్డీఓకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి శ్రీను, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అన్వేష్, జిల్లా కమిటీ సభ్యులు చిన్ని, మోక్షమ్మ, షరీఫ్, అనంతమ్మ, రూరల్, అట్లూరు, బి.కోడూరు మండలాల కన్వీనర్లు వెంకటేష్, రమణయ్య, ఓబయ్యలతో పాటు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కస్తూర్బాలో చేరాలని పోస్టర్లతో ప్రచారం



చాపాడులో పోస్టర్లను ఏర్పాటు చేస్తున్న ఎంఈఓలు

చాపాడు : స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులు చేరేందుకు ప్రజలకు అవగాహన కల్పించేలా పోస్టర్లను ఏర్పాటు చేస్తున్నారు. క్రమంలో గురువారం మండల కేంద్రమైన చాపాడులో ఎంఈఓలు రవిశంకర్, వంశీకృష్ణలతో పాటు కస్తూర్బాగాంధీ పాఠశాల స్పెషలాఫీసర్ నాగలక్ష్మీ, ఉపాధ్యాయ సిబ్బంది పలు చోట్ల పోస్టర్లను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ రవిశంకర్ మాట్లాడుతూ కస్తూర్బాలో 6, 11వ తరగతుల్లో చేరేందుకు, 7, 8, 9, 10, 12వ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం విద్యార్థినులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పోస్టర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. బడి ఈడు పిల్లలు, బడి మానేసిన పిల్లలు, పేదలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు చెందిన అర్హత కలిగిన బాలికలు ఈ నెల 11వ తేది లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కస్తూర్బాగాంధీ విద్యాలయంలో ప్రైవేటు పాఠశాలు, కాలేజీలకు ధీటుగా అన్ని రకాలైన సౌకర్యాలు ఉన్నాయన్నారు. పేదలు, ఆర్థిక స్థోమత లేని వారు తమ పిల్లలను కస్తూర్బాలో చేర్పించాలని ఎంఈఓ కోరారు.

ఉపాధ్యాయుల ప్రవర్తనను పర్యవేక్షిస్తుండాలి



మాట్లాడుతున్న అర్బన్ సీఐ రాజగోపాల్

బద్వేలు అర్బన్ : ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తమ పాఠశాలలో పనిచేస్తుండే ఉపాధ్యాయుల ప్రవర్తనను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని అర్బన్ సీఐ ఎం.రాజగోపాల్ పేర్కొన్నారు. ఇటీవల పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో విద్యార్థినిపై ఓ ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించిన నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యంతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో పిల్లలు ఇంట్లో తల్లిదండ్రుల వద్ద కంటే పాఠశాలలోనే ఎక్కువ సమయం గడుపుతారని, ఈ క్రమంలో ఉపాధ్యాయులు మంచి ప్రవర్తన కలిగి ఉండటంతో పాటు విద్యార్థులకు మంచి ప్రవర్తన అలవడేలా కృషి చేయాలని కోరారు. అలాగే ప్రతి పాఠశాలలో విద్యార్థులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో ఎంఈఓలు రఘురాములు, చెన్నయ్య, జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు జి.వి.సుబ్బారెడ్డి, ఆయా ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే, మైదుకూరు మాజీ ఎమ్మెల్యేలు



పూజల్లో పాల్గొన్న జెడ్పీ చైర్మన్, బద్వేలు ఎమ్మెల్యే, మైదుకూరు మాజీ ఎమ్మెల్యేలు

బద్వేలు అర్బన్ : పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయనగర్, త్యాగరాజకాలనీల సమీపంలో ఉన్న శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి స్ఫటిక శివాలయం ద్వితీయ వార్షికోత్సవం, వల్లి దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి, కుమారస్వామి నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు గురువారం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమాల్లో జిల్లా పరిషత్ చైర్మన్ రామగోవిందరెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆలయ నిర్వాహకులు వారికి పూర్ణకుంభ స్వాగతం పలికి స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ చిన్నపోలిరెడ్డి, బి.మఠం ఎంపీపీ వీరనారాయణరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు నేలటూరి సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి రామసుబ్బారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పోలిరెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, ఆలయ చైర్మన్ రామనబోయిన మురళి, ఆలయ ప్రధాన అర్చకులు ఎం.సత్యనారాయణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు : ప్రభుత్వ నిబంధనలు, యూజీసీ నిబంధనలు పాటించకుండా నడుపుతున్న కళాశాలలపై యోగి వేమన యూనివర్సిటీ అధికారులు చర్యలు తీసుకోవాలని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కొన్ని కళాశాలలు, సత్రాలు, అపార్ట్‌మెంట్లలో, షాపింగ్ కాంప్లెక్స్‌లో నడుపుతున్నారన్నారు. ఎలాంటి బిల్డింగ్ ప్లానింగ్, ఫైర్ సేఫ్టీ లేకుండా ప్రమాదంగా కళాశాలలు నడుపుతున్నారని తెలిపారు. యోగి వేమన యూనివర్సిటీ నూతన వైస్ ఛాన్సలర్ స్పందించి జిల్లాలో ఇలాంటి కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఓపెన్ జిమ్ ప్రారంభం

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని గోపవరం పంచాయతీ హౌసింగ్ బోర్డు కాలనీలోని పబ్లిక్ పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పంచాయతీ నిధులు రూ.6 లక్షలతో ప్రజల సౌకర్యార్థం ఈ జిమ్ ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. హౌసింగ్ బోర్డు కాలనీ, భగత్ సింగ్ కాలనీ వాసులు ఈ పార్కుకు వాకింగ్‌కు వస్తున్నారని, ఓపెన్ జిమ్ వారికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ లక్ష్మీనారాయణరెడ్డి, ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి, అధికారులు రామాంజనేయ రెడ్డి, రామకృష్ణ, టీడీపీ నాయకులు నంద్యాల కొండారెడ్డి, బచ్చల పుల్లయ్య, బచ్చల వీరప్రతాప్, పొట్టు లక్ష్మిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు రూరల్ ఎస్‌ఐగా నియమితులైన అరుణ్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ మహమ్మద్ రఫీ సిద్ధవటం పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. 2009 బ్యాచ్‌కు చెందిన అరుణ్‌రెడ్డి జిల్లాలోని దువ్వూరు, ఖాజీపేట, కడప, సిద్ధవటం, చిట్వేల్, సీకేదిన్నె, ప్రొద్దుటూరులోని రూరల్, త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్లలో పనిచేశారు. ప్రస్తుతం కడప స్పెషల్‌బ్రాంచ్ ఎస్‌ఐగా పనిచేస్తూ ప్రొద్దుటూరు రూరల్ స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాలపై దృష్టి సారిస్తామన్నారు. అలాగే పేకాట, క్రికెట్ బెట్టింగ్, మట్కా లాంటి అసాంఘిక కార్యకలాపాలను రూపుమాపేందుకు కృషి చేస్తానని చెప్పారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి



ప్రసంగిస్తున్న డాక్టర్ పి.నారాయణరెడ్డి

చాపాడు : అధ్యాపకులు అంకిత భావంతో పనిచేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని హైదరాబాదుకు చెందిన ఐసీబీఎం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఎక్సలెన్స్ డైరెక్టర్ జనరల్ డా.పి.నారాయణరెడ్డి, కడప యోగి వేమన యూనివర్సిటీ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ)కాలేజీలో రెండు రోజులుగా జరుగుతున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన డా.పి.నారాయణరెడ్డి, టి.శ్రీనివాస్ ప్రసంగిస్తూ.. ప్రతి అధ్యాపకులు 11 లక్షణాలను దృష్టిలో ఉంచుకుని విద్యను బోధించాలన్నారు. ప్రతి తరగతిలో వెనకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. అందరికీ విద్య బోధించే క్రమంలో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీబీఐటీ డైరెక్టర్ అడ్మిన్ డా.జి.శ్రీనివాసులరెడ్డి, ప్రిన్సిపాల్ డా.ఎస్.శృతి, ఎంబీఏ హెచ్‌ఓడి డా.ఆర్.ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

బద్వేలు అర్బన్ : ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిపో గేటు వద్ద ఉద్యోగులు ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ డిపో కార్యనిర్వాహణ అధ్యక్షుడు ఎస్.జనార్దన్‌రావు, డిపో, గ్యారేజీ సెక్రటరీలు చంద్రయ్య, నాగేంద్రలు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు ఈహెచ్‌ఎస్ కార్డు బదులు పాత పద్ధతిలో సీలింగ్ లేని వైద్య సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే పనిష్మెంట్ పూర్తయిన వారికి సకాలంలో ఇంక్రిమెంట్స్ కలపడంతో పాటు అప్పీలుకు అవకాశం కల్పించాలని కోరారు. ప్రైవేటు బస్సుల తాకిడి తట్టుకునే విధంగా సంస్థ ఆధ్వర్యంలో కొత్త బస్సులు కొనుగోలు చేయాలని కోరారు. ఉద్యోగులకు అత్యవసర సమయాల్లో మూడు రోజులు సెలవు ఇవ్వడంతో పాటు మహిళలకు చైల్డ్‌కేర్ లీవ్‌ల మంజూరులో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని కోరారు. అలాగే పెండింగ్‌లో ఉన్న నాలుగు సంవత్సరాల లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చిన్నపరెడ్డి, సంయుక్త కార్యదర్శులు రమణ, వాసులు, హుస్సేన్, భాస్కర్, శ్రీధర్, సహాయ కార్యదర్శులు మల్లి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు, అధ్యాపకులకు వేతనాలు ఇవ్వాలి

ప్రొద్దుటూరు : జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులకు 12 నెలల వేతనాలివ్వాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. స్థానిక డీవైఎఫ్‌ఐ కార్యాలయంలో విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ యాజమాన్యాలు ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల ఉపాధ్యాయులు, అధ్యాపకులతో వెట్టి చాకిరి చేయించుకుంటున్నాయని తెలిపారు. వారికి పది నెలల వేతనాలు ఇచ్చి సరిపెడుతున్నాయని, విద్యార్థులకు ర్యాంక్ రావాలన్నా, పాఠశాల, కాలేజీల్లో అడ్మిషన్లు పెరగాలన్నా కీలక భూమిక వారిదేనన్నారు. కనీస సౌకర్యాలకు నోచుకోక , పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం లేక, ఉద్యోగ భద్రత లేకుండా ఏళ్ల తరబడి ప్రైవేటు విద్యా సంస్థల అభివృద్ధికి వారు పనిచేస్తున్నారన్నారు. సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వాలు పట్టించుకునే దాఖలాలు లేవన్నారు. ఈ సమావేశంలో మేరీకుమార్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

ఆలయ చందాలపై చెలరేగిన వివాదం

- కమిటీ సభ్యుల మధ్య మాటల యుద్ధం
- పోలీస్ స్టేషన్‌కు చేరిన పంచాయితీ
- వైఎస్సార్ సీపీ నాయకుడు వేమారెడ్డిపై దాడి
- నిరసనగా రాత్రి వరకూ ధర్నా



పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న గ్రామస్తులు



పోలీసులను నిలదీస్తున్న గ్రామస్తులు

ఖాజీపేట : తుడుమలదిన్నె గ్రామంలో నూతనంగా నిర్మించిన అంకాళమ్మ ఆలయానికి వచ్చిన చందాలు.. జమా ఖర్చుల విషయమై జరిగిన వివాదం కాస్తా.. పోలీస్ స్టేషన్‌కు చేరి చివరకు పోలీసుల తీరుకు నిరసనగా ధర్నా చేయాల్సి వచ్చింది. ధర్న చేస్తుండగానే వైఎస్సార్ సీపీ నాయకుడు వేమారెడ్డి పై దాడి జరగడంతో.. నిరసన రాత్రి 10 వరకూ జరిగిన సంఘటన ఖాజీపేట పోలీస్ స్టేషన్ వద్ద చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. తుడుమలదిన్నె గ్రామంలో అంకాళమ్మ అలయంను గ్రామస్తులు కలసి నూతనంగా నిర్మించారు. గుడి నిర్మాణంలో 14 మంది కమిటీ సభ్యులుగా ఏర్పడి చందాల రూపంలో వచ్చిన డబ్బుతో ఆలయం పూర్తి చేశారు. అయితే ఆలయ కమిటీలోని శ్రీనివాసుల రెడ్డి అనే సభ్యుడు ఆలయానికి వచ్చిన చందాలు ఎంత.. అందులో ఎంత ఖర్చు చేశారు.. దానికి సంబంధించిన బిల్లులు చూపాలని నిలదీశారు. నీకు జమా ఖర్చులు చెప్పాల్సిన అవసరం లేదని చెప్పడంతో.. వారి మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. వెంటనే శ్రీనివాసులరెడ్డి అనే టీడీపీ నాయకుడు ఖాజీపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పోలీస్ స్టేషన్ చేరిన పంచాయితీ

జమా ఖర్చుల విషయంపై ఖాజీపేట సీఐ మోహన్ గ్రామంలోని కమిటీ సభ్యులు అందరినీ రావాలని జమా ఖర్చులు చెప్పాలని సూచించారు. దీంతో కమిటీ సభ్యులతో పాటు గ్రామస్తులు అందరూ వచ్చి పోలీస్ స్టేషన్ ముందు బైటాయించారు. గ్రామంలోని సమస్యను పోలీస్ స్టేషన్‌లో పంచాయితీ చేయడం సబబు కాదని సీఐని కోరారు. జమా ఖర్చుల కోసం గ్రామంలో 18వ తేదీన జరగాల్సిన ఉత్సవాలను ఆపాలని చెప్పడం సరైంది కాదని చెప్పారు. కేవలం ఒక్క మనిషి కోసం ఇంత మందిని ఇబ్బంది పెట్టడం సరైంది కాదని అన్నారు. గ్రామస్తుల పట్ల మీ వ్యవహార శైలి బాగాలేదని, జమా ఖర్చులు గ్రామంలో చూసుకుంటామని.. ఇలా పోలీస్ స్టేషన్‌కు పిలిపించి అందరినీ ఇబ్బంది పెట్టడం మీకు తగదని అన్నారు. దీంతో సీఐ నుంచి సరైన సమాధానం రాక పోవడంతో ట్రాక్టర్లలో మైదుకూరు డీఎస్పీ కార్యాలయం వద్ద ధర్నాకు వెళ్లారు. డీఎస్పీ లేక పోవడంతో తిరిగి ఖాజీపేట స్టేషన్ వద్ద బైటాయించారు.

వైఎస్సార్ సీపీ నాయకుడు వేమారెడ్డిపై దాడి

పోలీస్ స్టేషన్‌లో ధర్నా జరుగుతున్న విషయం తెలుసుకుని ఫర్టిలైజర్ దుకాణంలో ఉన్న తిమ్మారెడ్డిపల్లె నాయకుడు వేమారెడ్డి గ్రామస్తుల వద్దకు వెళ్తుండగా టీడీపీ నాయకుడు శ్రీనివాసులరెడ్డి అడ్డగించారు. మా గ్రామంలో జరిగే విషయంలో నీ జోక్యం ఎందుకని నిలదీశారు. ఇరువురి మధ్య వాక్ యుద్ధం నడిచింది. ఇద్దరి మధ్య తోపులాట జరిగింది. ఇంతలో స్థానికులు విడిపించారు.

కేసు నమోదు చేయాల్సిందే

వేమారెడ్డి పై దాడిపై గ్రామస్తులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అతన్ని పిలిపించి క్షమాపణ చెప్పించాలని పోలీసులను కోరారు. అంత వరకూ ఇక్కడి నుంచి కదిలి వెళ్లేది లేదని అక్కడే మహిళలు, స్థానికులు ధర్నాకు కూర్చున్నారు. మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్ వచ్చి గ్రామస్తులు, నాయకులను పిలిపించుకుని చర్చించారు. వేమారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని మైదుకూరు రూరల్ సీఐ హామీ ఇచ్చారు. అలాగే గ్రామంలో జరిగే అంకాళమ్మ తిరునాలను ఘనంగా నిర్వహించుకోవాలని అందుకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి పూర్తిగా మీకు సహకరిస్తామని హామీ ఇవ్వడంతో.. గ్రామస్తులు సంతృప్తి చెంది అక్కడి నుంచి వెళ్లిపోయారు.